క్లుప్తంగా

మాలమహానాడు జిల్లా కార్యదర్శిగా రాఘవులు



నియామకపత్రం అందుకుంటున్న రాఘవులు

భీమారం: జాతీయ మాల మహానాడు జిల్లా కార్యదర్శిగా మండలంలోని దాంపూర్ గ్రామానికి చెందిన కందుగుల రాఘవులు నియమితులయ్యారు. రాష్ట్ర అధికార ప్రతినిధి పైడిమల్ల నర్సింగ్ శుక్రవారం ఆయనకు నియామకపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కనక రాజులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహన పత్రాలు పరిశీలిస్తున్న ఎస్సై

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి–వేమనపల్లి ప్రధాన రహదారిలో ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రాణహిత నది అవతలి వైపు ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో అడపదడపా ఘటనలు, మావోల కదలికలు ఉన్నందున వాహనాల రాకపోకలపై దృష్టిసారించారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. వాహనదారులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పాఠశాల సభా వేదిక ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎంఈవో, తదితరులు

జన్నారం: మండలంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు పొనకల్‌కు చెందిన మల్యాల బాపన్న, కుటుంబ సభ్యులు విరాళం ద్వారా సభా వేదికను నిర్మించారు. మల్యాల బాపన్న, ఎంఈవో విజయ్‌కుమార్‌లు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మల్యాల బాపన్న కుమారుడు వేణు, కుటుంబ సభ్యులు కలిసి రూ.4 లక్షలతో సభా వేదిక, వంట గదిని నిర్మించడం అభినందనీయమన్నారు. హెచ్‌ఎంలు జనార్దన్, సత్యనారాయణ, చందులాల్, ప్రకాశ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న బండి రమేశ్

చెన్నూర్: పెండింగ్ బిల్లులను ఈనెలఖారులోగా చెల్లించాలని తపస్ అదనపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ డిమాండ్ చేశారు. స్థానిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తపస్ డివిజన్ స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబించడంతో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. సీపీఎస్ రద్దుతో నిలిచిపోయిన పదోన్నతులు ఇవ్వాలన్నారు. 317 జీవో ప్రకారం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, రవికుమార్, జిల్లా నాయకులు సత్తిరెడ్డి, తొడె తిరుపతి, శ్రీకాంత్, భాగ్యలక్ష్మి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తె,మెట్టెలు అందజేత



మల్లేశ్వరికి పుస్తెమెట్టెలు అందజేస్తున్న ఎమ్మెల్యే

భీమారం: మండల కేంద్రానికి చెందిన అబ్బర్ల శంకర్–లక్ష్మి దంపతుల కుమార్తె మల్లేశ్వరి వివాహం కోసం కాంగ్రెస్ నాయకుడు ఉస్కమల్ల పున్నం చందు సొంత ఖర్చులతో పుస్తెమెట్టెలు, దుస్తులను అందించారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ శుక్రవారం వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద యువతి మల్లేశ్వరి వివాహానికి పున్నం చందు చేయుతనివ్వడం అభినందనీయమన్నారు. నాయకులు పొడేటి రవి, కొత్త సత్తిరెడ్డి, ఉస్కమల్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



మందమర్రిరూరల్: సందేశమిస్తున్న పాస్టర్ జెర్మియ



బెల్లంపల్లి: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



చెన్నూర్ సీఎస్ఐ చర్చిలో..



మంచిర్యాలఅర్బన్: సందేశమిస్తున్న పాస్టర్ శాంతికుమార్

జిల్లావ్యాప్తంగా గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయ నుంచి చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తుజీవిత చరిత్ర, సూక్తులను పాస్టర్లు వివరించారు. బెల్లంపల్లిలో కల్వరీ మినిస్ట్రీస్, సీఎస్ఐ, బేత్లెహేం, సీఎంఐ, హెబ్రోను, షాలేం, పెంతేకోస్తు, ఆర్‌సీఎం, మందమర్రి, చెన్నూర్, కాసిపేట, దండేపల్లి, లక్సెట్టిపేట, భీమారం, జైపూర్ మండలాల్లోని చర్చీలు, మంచిర్యాలలోని దహించు అగ్ని ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భీమారంలో కర్రతో చేసిన శిలువని ప్రదర్శనగా క్రైస్తవులు ఊరేగింపు నిర్వహించారు. నెన్నెల చర్చిలో ఫాదర్ ప్రభాకర్, జెండావెంకటాపూర్‌లో ఫాదర్ జోసెఫ్ ఆధ్వర్యంలో దైవ సందేశమిచ్చారు. అంతకుముందు క్రీస్తు శిలువ మార్గాన్ని అనుసరించి గ్రామ పురవీధుల్లో శిలువధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్



భీమారంలో శిలువతో ఊరేగింపు చేస్తున్న క్రైస్తవులు



లక్సెట్టిపేట: సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



దండేపల్లి: సీఎస్ఐ చర్చిలో..



జైపూర్ చర్చి వద్ద పిల్లాపాపలతో క్రైస్తవులు





నెన్నెల: జెండావెంకటాపూర్‌లో శిలువమార్గాన్ని అనుసరిస్తున్న క్రైస్తవులు

టీడీపీ ఆవిర్భావ వేడుకలు



బెల్లంపల్లి: ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: పట్టణంలో టీడీపీ 43వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీఎన్‌టీయూసీ కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు టీ.మణిరాంసింగ్, నాయకులు జీవరత్నం, పెండ్యాల శ్రీనివాస్, మల్లయ్య, రమేశ్, హాసన్, యాదగిరి, కుమార్, గంగాధర్‌గౌడ్, వెంకటేశ్, శంకరయ్య, గణేశ్, నర్సింగ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని టీఎన్టీయూసీ ఆఫీస్‌లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. నాయకులు ఉమామహేశ్వరరావు, వాసాల సంపత్, తిరుపతి, సత్యనారాయణ, జయ, సంధ్య ఉన్నారు.

బీఎస్పీ జిల్లా కార్యవర్గం

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలో బీఎస్పీ జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జి బోస్ తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా మేరుగు నరేందర్, ప్రధాన కార్యదర్శిగా పార్వంది రమేశ్, కోశాధికారిగా నామ కుమారస్వామి ఎన్నికయ్యారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్

కోటపల్లి: మండలంలోని మల్లంపేట గ్రామంలో బయ్యాదీక్షిత్ జ్ఞాపకార్థంగా శుక్రవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ సర్పంచ్ సల్పాల పోచన్న ప్రారంభించారు. కొండ్ర సుదర్శన్, సురేశ్, నాగన్న,రాజేందర్, విష్ణు, ప్రకాశ్ పాల్గొన్నారు.

నవజాత శిశువులకు అరుదైన చికిత్స

మంచిర్యాలటౌన్: అతి తక్కువ బరువుతో జన్మించిన నవజాత శిశువులకు పట్టణంలోని అవని పిల్లల ఆస్పత్రిలో అరుదైన చికిత్స చేశారు. ఆస్పత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యుడు రఘువంశీ మాట్లాడారు. కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన దీపిక, మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన మానస వేరే ప్రాంతాల్లో నెలలు నిండక ముందే ప్రసవమయ్యారు. పుట్టిన శిశువులు ఒకరు 575 గ్రాములు, మరొకరు 800 గ్రాములతో జన్మించారని తెలిపారు. అవని ఆస్పత్రిలోని ఇంటెన్సివ్ కేర్ విభాగంలో ఒకరిని 40 రోజులు, మరొకరిని 30 రోజులు ఉంచి అధునాతన చికిత్స అందించామన్నారు. చికిత్స అనంతరం 575 గ్రాముల శిశువు 1.5 కేజీలు, 800 గ్రాముల శిశువు 1.3 కేజీల బరువు పెరిగినట్లు తెలిపారు. శిశువులకు చికిత్స చేసిన వైద్యులను తల్లిదండ్రులు అభినందించారు.



నవజాత శిశువులతో వైద్యుడు రఘువంశీ

మట్టి కుండ..సల్లగుండ

నెన్నెల: అన్నివృత్తుల కన్నా కులవృత్తే మిన్న అంటారు. చెరువులు, కుంటల నుంచి కుమ్మరులు మట్టిని తెచ్చి పొడి చేసి ఎండకు ఆరబెట్టి, నీళ్లలో నానబెట్టి ముద్దలుగా చేసి కుమ్మరి సారేపై కుండ తయారు చేస్తారు. ఈరోజుల్లో మట్టిపాత్రలకు డిమాండ్ పెరిగింది. వేసవి సమీపిస్తుండటంతో ఇలా మట్టిపాత్రలు చేస్తూ నెన్నెలలో ఓ కుమ్మరి ‘సాక్షి’కెమెరాకు చిక్కాడు.



ఘనంగా జనహిత సేవా సమతి వార్షికోత్సవం

బెల్లంపల్లి: పట్టణంలోని ఏఆర్ కన్వెన్షన్ హాల్‌లో జనహిత సేవా సమితి ఏడో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సమితి సభ్యులు కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ఆడెపు సతీశ్ మాట్లాడుతూ 15 మంది సభ్యులతో చలివేంద్రం ఏర్పాటుతో ఏర్పడిన స్వచ్ఛంద సంస్థ ప్రస్తుతం 80 మంది సభ్యులతో కొనసాగుతోందని తెలిపారు. దాతల సహకారంతో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. సేవా కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉన్న సభ్యులను సన్మానించారు. నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన జనహిత కుటుంబ సభ్యులు

ఇప్పపూల సేకరణ షురూ



ఇప్ప పూలు ఏరుతున్న మహిళ



ఇప్ప చెట్టు

చెన్నూర్‌రూరల్: గిరిగ్రామాల్లో ఇప్పపూల సేకరణ ప్రారంభమైంది. ఉదయం కోడి కూతతోనే మేల్కొని ప్రజలు వీటిని సేకరిస్తున్నారు. ఏటా వేసవిలో ఇప్పపూలు పూస్తాయి. మండలంలోని బుద్దారం, సంకారం, కన్నెపల్లి, అక్కెపల్లి గ్రామాల్లోని పురుషులు, మహిళలు ఈ పూలను సేకరించి వాటితో ఉపాధి పొందుతారు. ఉదయం చెట్ల వద్దకు వెళ్లి మూడు గంటల పాటు పూలు సేకరించి తట్టల్లో నింపుకొని ఇళ్లకు తీసుకువచ్చి ఆరబోస్తారు.

ఆహ్లాదం కరువు





మంచిర్యాలటౌన్: పట్టణంలోని రాముని చెరువు పిల్లల పార్కుపై మున్సిపల్ పాలకవర్గం పట్టింపు లేని కారణంగా ఆహ్లాదం కరువైంది. చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన పరికరాల వద్ద పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఏళ్లుగా వాటిని మున్సిపల్ సిబ్బంది తొలగించడం లేదు. నిర్మించినా మూత్రశాలలు పట్టించుకోకపోవడంతో వినియోగించే పరిస్థితుల్లో లేవు. వేసవి సెలవులు రానున్న నేపథ్యంలో చిన్నారులు ఆహ్లాదంగా గడిపేందుకు ఉన్న పరికరాలను సిద్ధం చేసేలా మున్సిపల్ పాలకవర్గం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అన్నివర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

చెన్నూర్: అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. స్థానిక సాయి మమత పాఠశాల మైదానంలో జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఫయాజొద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అల్లా దీవనతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకులు హిమవంతరెడ్డి, బషీరొద్దీన్, ఖాలీల్, నహీమ్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఐక్యంగా ఉండి గెలిపించుకుందాం




మాట్లాడుతున్న ముజాఫర్ అలీఖాన్

జన్నారం: అందరూ ఐక్యంగా ఉండి ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించుకుందామని పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, సీనియర్ నాయకుడు రాజశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ఇంటింటికీ వివరించి ఓట్లు అభ్యర్థించాలన్నారు. ప్రధాన కార్యదర్శి మాణిక్యం, నాయకులు సయ్యద్ ఇషాక్, దుర్గం లక్ష్మీనారాయణ, అజార్, సుధీర్‌కుమార్, శంకర్, కమలాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆటలు ఆడేదెలా..

చెన్నూర్‌రూరల్: యువత, పిల్లలు క్రీడల్లో రాణించేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. కానీ ఎక్కడ క్రీడా ప్రాంగణంలో ఆటలు సాగడం లేదు. మండలంలోని కన్నెపల్లి సమీపంలో శ్మశానవాటిక వద్ద క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. ఇలా అయితే ఆటలు ఆడేదెలా పలువురు ప్రశ్నిస్తున్నారు.



తవ్వారు.. వదిలేశారు..!



చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం గుంతను తవ్వి అలాగే ఉంచారు. దీంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకొని గుంతను పూడ్చి వేయాలని పలువురు కోరుతున్నారు.